ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025 5 అనంతపురం



రాష్ట్ర సదస్సులో కలెక్టర్ ఆనంద్



రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా నుంచి కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు

పేకాట ఆడుతున్నారంటూ పోలీసుల బెదిరింపు

తీవ్ర ఆందోళనకు గురైన వ్యక్తి అస్వస్థతకు గురై మృత్యువాత

పేకాట ఆడుతున్నావంటూ పోలీసులు బెదిరించడంతో ఓ వ్యక్తి తీవ్ర ఆందోళనకు గురై అధిక రక్తపోటుతో మరణించాడు. పోలీసులు వ్యవహరించిన తీరుపై బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ ఆసుపత్రి, పోలీసు స్టేషన్ వద్ద మృతదేహంతో ఆందోళన చేపట్టారు. అనంతపురం జిల్లా శింగనమల మండలం నాగులగుండం తండాలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది.

వార్త మెయిన్‌లో

కార్పొరేషన్‌లో సరెండర్ల పర్వం..!

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో సరెండర్ల పర్వం కొనసాగుతోంది. తొలుత తమ మాట చెల్లుబాటు కాలేదన్న నెపంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ ఉద్యోగిని రాజకీయ మెహర్బానిలో భాగంగా సరెండర్ లెటర్ పుట్టించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అనధికార వ్యక్తుల స్వప్రయోజనాల కోసం ఈ సరెండర్ లెటర్లు పుట్టుకొస్తున్నట్లు తెలుస్తోంది. రెండు నెలకుపైగా కొనసాగిన ఈ సరెండర్ పర్వంపై అధికార పార్టీ నేత ఆరా తీయడంతో అవసలు విషయం వెలుగు చూసింది. సదరు ఉద్యోగిపై కొనసాగిన సరెండర్ పర్వం ఎత్తేసేందుకు నిర్ణయం జరిగినా దానికి ఆమోద ముద్ర పడలేదు. ఇటీవల ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు స్రవంతి బదిలీపై వచ్చారు. కాగా స్రవంతికి స్థానం కేటాయించడానికి ఎలక్ట్రికల్ డిఈఈగా కొనసాగుతున్న సివిల్ ఇంజినీర్ దాక్షాయిని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ కార్పొరేషన్ అధికార యంత్రం లెటర్ పంపింది. ఇదే సమయంలో తన సరెండర్‌ను రద్దుచేసి కార్పొరేషన్‌లోనే కొనసాగేలా స్థానిక ప్రజా ప్రతినిధి లెటర్ ఒకటి పుట్టుకొచ్చింది. ఈ సిఫార్సు లేఖ విభాగాధిపతి అయిన సూపరిండెంట్ ఇంజినీర్ ప్రమేయం లేకుండానే కమిషనర్ వద్దకు వెళ్లి సంతకాలు చేయించడం కొసమెరుపు. డిఈ సరెండర్ అంశంలో ధిక్కారస్వరం సదరు ఉద్యోగి నుంచి ఎదురైనా ఉన్నతాధికారులు ఆ అంశానికి అడ్డుచెప్పకుండా చోద్యం చూస్తుండడం గమనార్హం. ఈ తంతు ఇలా కొనసాగుతుండగానే నెల రోజుల క్రితం ఇంజినీరింగ్ విభాగంలో సహోద్యోగిపై అనుచితంగా వ్యవహరించిన అసిస్టెంట్ ఇంజినీర్ విజయరాజును పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ అధికార యంత్రాంగం ఆలస్యంగా లేఖ సిద్ధం చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సహచర ఉద్యోగిపై అసభ్యకరంగా ప్రవర్తించిన అసిస్టెంట్ ఇంజినీర్‌పై చర్యలు చేపట్టడానికి అధికార వర్గాలు మీనమేషాలు లెక్కించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాసులు వస్తాయంటే ఆగమేఘాల మీద ఎలాంటి లేఖలైనా విభాగాధిపతి కళ్లుగప్పి చక్రం తిప్పటం ఇంజినీరింగ్ విభాగంలో పరిపాటిగా మారింది. ఇష్టారాజ్యంగా వ్యవహరించే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడంలో మాత్రం అధికార వర్గాలు మిన్నకుంటున్నాయి. అసిస్టెంట్ ఇంజినీర్ విజయరాజు సరెండర్ లెటర్‌పై ఉన్నతాధికారి సంతకాలు కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సరెండర్ లెటర్‌పై కదలిక రావటానికి ఇంకెంతకాలం పడుతుందోనని ఉద్యోగ వర్గాలలో చర్చ నడుస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొనసాగుతున్న సరెండర్ల పర్వం ఇక్కడితో ఫుల్ స్టాప్ పడతాయా లేక మరిన్ని తెరపైకి వస్తాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

6,57,248 క్యూఆర్ కోడ్ రేషన్‌కార్డులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాకు కొత్తగా 6,57,248 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయి. వీటిని సోమవారం అనంతపురం నగరం అశోక్‌నగర్ సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జిల్లాలోని అన్ని మండలాల్లో ఈరోజు ప్రారంభమైందన్నారు. స్మార్ట్‌రైస్ కార్డులను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేశారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయాలని అర్బన్ తహశీల్దార్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ రైస్ కార్డులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



స్మార్ట్ రైస్‌కార్డులను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాల్సిందే..

కలెక్టరేట్‌ను ముట్టడించిన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు తరలొచ్చి అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కే చేరుకున్నారు. పెద్దఎత్తున యువత, ప్రజాసంఘాల నేతలు కలెక్టరేట్‌లోని వెళ్లేందుకు గేట్లు ఎక్కి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో తీవ్ర తోపులాట చోసు చేసుకుంది. సాధ్యం కాక కొందరు పోలీసులు కింద పడిపోయారు. యువత బ్యారికేడ్‌లను ఒకదానిపై మరొకటి పడేసి నినాదాలు చేశారు. కోట్లాది మందికి సేవలు అందిస్తున్న ఆర్‌డిటి పట్ల కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంగా దుర్మార్గంగా ఉందన్నారు. తప్పుడు సమాచారంతో సంస్థ నిలుపుదల చేసేందుకు కుట్ర చేయడం సరికాదన్నారు. దళిత, గిరిజన జీవితాల్లో వెలుగు నింపిన ఆర్‌డిటి సేవలు దేశానికి ఎంతో ఆదర్శంగా నిలిచాయని అలాంటి సంస్థను మత మార్పిడి పేరుతో లేకుండా చేయాలని చూడటం సరికాదన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు



కలెక్టరేట్‌లోకి చొచుకెళ్లే ప్రయత్నం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఆర్‌డిటి మూసివేసి ఇతర దేశాలకు తరలిపోతే మాగతి ఏమవుతోందో ఆలోచించాలన్నారు. ఇప్పుడిప్పుడు ఎంత పెద్ద భారీ పరిశ్రమ జిల్లాకు తీసుకొచ్చిన ఆర్‌డిటి సేవలకు పైసా భాగం కూడా సరిపోదన్నారు. గొప్పలు చెప్పే పాలకులు ఉన్న కల్పతరువు వంటి సంస్థ నిర్వీర్యం చేయకుండా కాపాడాలన్నారు. ఆర్‌డిటికి నష్టం జరిగితే ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్‌కళ్యాణ్, బిజెపి ప్రభుత్వాలు స్పందించి ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏను రెన్యూవల్ చేయించి సజావుగా కార్యకలాపాలు సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే హింస్తాత్మకంగా పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ ఖ్యాతి గడించిన 'మోక్షగుండం'

ఇంజనీర్స్ డే వేడుకల్లో జెఎన్‌టియు విసి సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రపంచ ఖ్యాతి గడించిన ఇంజినీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య కీర్తి గడించారని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు హర్షం వ్యక్తం చేశారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని సోమవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డేను జరుపుకుంటున్నామన్నారు. అలాంటి ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అలాగే యూనివర్సిటీ పరిపాలన భవనంలో కూడా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. అనంతరం విద్యార్థుల ప్రయోగశాలలను తెలుసుకుని సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్ భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, బి.ఈశ్వర్‌రెడ్డి, జి.ప్రశాంతి, వైశాలి ఘోర్పడే, బి.దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, నాగప్రసాద్ నాయుడు, ఎపి శివకుమార్, ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, భువనవిజయ, అరుణకాంతి, భవాని, భారతి, కళ్యాణ్‌కుమార్, దిలీప్‌కుమార్, చంద్రమోహన్‌రెడ్డి, ఎం.రామశేఖర్‌రెడ్డి, కళ్యాణిరాధా, అజిత, శారద, మమత, శ్యాంబాబు, మాజీ ఆచార్య వి.శంకర, డిప్యూటీ రిజిస్ట్రార్ రంగానాయక్, మధుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగభూషణం, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మోక్షగుండంకు నివాళి అర్పిస్తున్న జెఎన్‌టియు విసి, ఇతర అధ్యాపకులు

తాడిపత్రి : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇంజినీర్స్ డే సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు అధ్యక్షతన సోమవారం తాడిపత్రిలోని విద్యుత్ సబ్ డివిజినల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని జెసి ఆవిష్కరించారు. ఇందులో భాగంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈలు సంపత్, జేమ్స్ జయచంద్ర, ఇఇ పద్మనాభపిళ్లై, సబ్ డివిజన్ పరిధిలోని ఇఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాలోకి యుటిఎఫ్ రణభేరి



రణభేరి పోస్టర్లు విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికై యుటిఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'రణభేరి' పోస్టర్లను సోమవారం డి.హీరేహాల్‌లోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విడుదల చేశారు. యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ రణభేరి జాతా ఈ నెల 16వ తేదీ గుంతకల్లులో ప్రవేశించి వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం మీదుగా సాగుతుందన్నారు. అందులో యుటిఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్దుల్ మునాఫ్, యుటిఎఫ్ డి.హీరేహాల్ మండల శాఖ అధ్యక్షులు ఆర్.మోహన్‌బాబు, సహాధ్యక్షులు జిఎస్.హనుమంతప్ప, గౌరవాధ్యక్షులు హనుమంతప్ప, వెంకోబరావు, యుటిఎఫ్ నాయకులు ఇరాలప్ప, అయ్యన్న, శ్రీనాథ్, గంగాధర్, అరుణ్‌కుమార్, శశిధర్, ఉరుకుందప్ప, ఉపాధ్యాయులు కిరణ్, నాగలింగయ్య, సైఫుల్లా, భీమయ్య, జయశ్రీ, విజయభారతి, రామలక్ష్మి, సునీత, భార్గవి, విజయమ్మ, అమరవాణి, సుజాత, నాగవేణి, జ్యోతి, తేజశ్విని, శాంతకుమారి, కేదారేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంతకల్లులో ప్రారంభం

గుంతకల్లు: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) చేపట్టిన రణభేరి ప్రచార యాత్ర మంగళవారం నాడు గుంతకల్లుకు రానుంది. ఈ మేరకు ఆ యూనియన్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం 7:30 గంటలకు స్థానిక సరోజినీ నాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో రణభేరి ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమం పతాకావిష్కరణతో మొదలై అక్కడి నుండి హనుమాన్ సర్కిల్ వరకు బైక్ జాత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు జయచంద్ర రెడ్డి, లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులతో పాటు జిల్లా నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు,కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యాసరచన పోటీల్లో గోల్డెన్ బెల్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఫాదర్లు పీటర్, జేమ్స్

వ్యాసరచన పోటీల్లో స్థానిక గోల్డెన్ బెల్స్ హైస్కూల్ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్స్ జాన్‌పీటర్, జేమ్స్ తెలిపారు. టాటా కంపెనీ ఆధ్వర్యంలో స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించడానికి నేను చేసే ఐదు పనులు(ఫైన్‌థింగ్స్ ఐ విల్ డు టు బిల్డ్ ఏ సెల్ఫ్ - రిలయంట్ ఇండియా) అంశంపై సీనియర్, జూనియర్ విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ఎం.గౌమత్‌రాజు, ఆర్షియా రోషిని, ఎఎస్ కాషీఫా, జూనియర్స్ విభాగంలో సనశ్రీ, ఎన్.భవ్య, కృష్ణమనోహర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం అభినందించారు.

పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పెన్షనర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విశ్రాంత ఉద్యగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ పెన్షనర్లు మృతి చెందిన సమయంలో 3 నెలలైనా మట్టి ఖర్చులను చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. 60 నెలల కరువు భృతి, పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 12వ పీఆర్‌సీ కమిటీని నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు వన్నూరుస్వామి, మారెన్న, ఇస్మాయిల్, హంపన్న, భగవాన్‌దాస్, కృష్ణమరాజు, గంపన్న, నరసింహులు, బసన్న తదితరులు పాల్గొన్నారు.

భారతి ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా స్థాయిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భారతి ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం లభించింది. మదర్ ఆర్గనైజేషన్ వివిధ రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న సంస్థలను గుర్తించి సోమవారం విజయవాడలో జాతీయ పురస్కారాలు ప్రదానం చేసింది. అందులో భాగంగా భారతి ఫౌండేషన్ సేవలను గుర్తిస్తూ సినీనటులు పృథ్వీరాజ్, రంజితషిండే, శ్రీలీల చేతుల మీదుగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రణవ్‌సాయిని సన్మానించి అంబేద్కర్ జాతీయ పురస్కారం అందజేశారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని లింగదహాల్, శ్రీరంగాపురం, కృష్ణాపురం, కొలగానహళ్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపిడిఓ విజయభాస్కర్ పరిశీలించారు. కాలువలు, పొలాలకు వెళ్లే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని రైతులు ఎంపిడిఓకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట ఎపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

రాయదుర్గంలో టిడిపి, వైసిపి నేతల వాగ్వాదం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో సోమవారం సాయంత్రం తెలుగుదేశం, వైసిపి నేతల మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. "బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ" పేరిట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణంలోని 31, 32 ఎన్నికల వార్డులలో ప్రచారం చేయడానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప పార్టీ నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, నాగప్ప, వార్డు సభ్యురాలు లావణ్య తదితరులు పార్వతి నగర్ వైపు పర్యటించడానికి వెళ్లారు. ఈ సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పార్టీ ఇన్‌ఛార్జి శంకర్, యల్లప్ప, రాజశేఖర్ తదితరులు వారిని అడ్డుకున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే మోసం గ్యారెంటీ అని ఎలా వ్యతిరేకంగా ప్రచారం చేస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం కొనసాగింది. ఇన్స్‌పెక్టర్ జయ నాయక్ జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

హోటళ్లు, రెస్టారెంట్ల రంగానికి చేయూతనివ్వాలి

ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-అనంతపురం



రాష్ట్రంలో హోటళ్లు, రెస్టారెంట్ల రంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని ఎపి హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.రమణ అన్నారు. రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన రమణ ఎన్నికైన సందర్భంగా సోమవారం స్థానిక ఎస్ఎస్ ప్యాలెస్ కాన్ఫరెన్స్ హాల్లో అనంతపురం హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండి వి.రమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్ల రంగం కరోనా అనంతరం అనేక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక దృక్పథంతో యాజమాన్యాలు పని చేస్తున్నాయన్నారు. అందుకు ప్రధాన ఉదాహరణ కోవిడ లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వంతో కలిసి హోటల్స్, రెస్టారెంట్స్ యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాయన్నారు. అలాంటి రంగానికి ప్రభుత్వ చేయూత అవసరమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లైసెన్సుడు హెూటల్స్ రెస్టారెంట్లకు తగిన ప్రోత్సాహం చేయూత ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లైసెన్సుడు హోటల్స్, రెస్టారెంట్లకు 12 గంటల వరకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు హోటల్స్, రెస్టారెంట్స్ నిబంధన ప్రకారం అన్ని లైసెన్సులు కడుతూ పర్యాటకులకు రాత్రి 10 గంటల వరకూ సేవలందిస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని జిల్లాల్లో 9:30 కి పోలీసు వారు వచ్చి బంద్ చేయిస్తున్నారన్నారు. ఈంతో 10 గంటల తర్వాత ఆహారం దొరక్క పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్స్, రెస్టారెంట్ సంఘం జిల్లా కార్యదర్శి ఆనంద్, ట్రెజరర్ షబ్బీర్, సభ్యులు గోల్డెన్ తాజ్ బాషా, పార్క్‌లేన్ హరి, సుఖ సాగర్ శ్రీధర్, రాఘవేంద్ర, జితేంద్ర, పలు హోటళ్లు, రెస్టారెంట్ల అధినేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కళ్యాణదుర్గం రూరల్ : 'జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ టీకా' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలం లోని బోరంపల్లి, బెళుగుప్ప మండలంలోని నరసాపురం గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ కార్యక్రమాన్ని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.శ్రీనివాసగుప్తా పరిశీలించారు. డాక్టర్ పి.మంజునాథ్, కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల పశు వైద్య అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి పాడి రైతులకు సూచించారు. మండలంలోని మల్కాపురం, 74-ఉడేగోళం, ఆవులదట్ల గ్రామాల్లో పశువులకు టీకా వేసినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

కళ్యాణదుర్గం టౌన్ : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కళ్యాణదుర్గం హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ సూచించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మలేరియా సబ్‌యూనిట్ అధికారి తిరుపాల్ అధ్యక్షతన డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥రాజేష్ మాట్లాడుతూ వ్యాధులను ముందుగానే గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్య పరచాలన్నారు.

హిందీ భాష నేర్చుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

హిందీ భాష నేర్చుకోవడం వల్ల ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఉపయోగకరంగా ఉంటుందని కెటిఎస్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువమంది మాట్లాడుతున్న భాషల్లో హిందీ కూడా ఒక్కటని గుర్తు చేశారు. హిందీ అధ్యాపకులు కోదండరాములు మాట్లాడుతూ ఉత్తర భారతంలో ఉద్యోగం చేసేందుకు హిందీ భాష ఉపకరిస్తుందన్నారు. హిందీ భాషలో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణ పై అవగాహన

ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మాస్ ఎడ్యుకేషన్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి వృద్ధురాలి కళ్లు దానం



అక్కమ్మ(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం


మండలంలోని ముప్పులకుంట గ్రామానికి చెందిన చాపరి అక్కమ్మ(95) సోమవారం మృతిచెందింది. దీంతో ఆమె మనవళ్లు జగదీశ్, జనార్దన్, హరికృష్ణ, మల్లికార్జున, బ్రహ్మయ్య మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర ఆ గ్రామానికి రాగా వారు అక్కమ్మ కళ్లను రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశారు. అక్కమ్మ సర్పంచి చాపిరి కొల్లాపురమ్మ అత్త. అక్కమ్మ మనవళ్లు పోలీస్ శాఖలో కానిస్టేబుల్, ఎస్ఐ, సిఐ స్థాయిలో ఉన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పిల్లలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి రాహుల్ ఆచూకీ లభ్యమైనట్లు తల్లి స్వరూప తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం కనిపించకుండాపోయిన రాహుల్ తిరిగి సోమవారం సాయంకాలం పిల్లలపల్లిలో సొంత ఇంటి వద్దకు క్షేమంగా చేరుకున్నాడు. తప్పిపోయిన కుమారుడు ఇంటికి చేరడంతో ఆ తల్లి ఎనలేని సంతోషం వ్యక్తం చేసింది. పోలీసులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

యూరియా సరఫరాలో నిర్లక్ష్యం తగదు


ఎఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతుసంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. సోమవారం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ మండలంలో రైతులు వేలాది ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తున్నారన్నారు. వారందరూ యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న అధికారులు, ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే యూరియాని బహిరంగ మార్కెట్‌లో రూ.400 నుంచి రూ.450 వరకూ అమ్ముకుంటున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. వెంటనే అన్ని రైతు సేవాకేంద్రాల్లో యూరియాని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి,కౌలు రైతు సంఘం నాయకులు వెంకటేశులు, రైతు సంఘం నాయకులు మురళి, వీరాంజనేయులు, సిద్ధప్ప, సుంకన్న,కౌలు రైతులు రైతులు పాల్గొన్నారు.

రాచేపల్లి చెప్పుల పరిశ్రమను ప్రారంభించాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని రాచేపల్లి గ్రామం వద్ద ఉన్న చెప్పుల పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచేపల్లి గ్రామ వద్ద ఉన్న చెప్పుల పరిశ్రమలో ఇప్పటికే చాలామంది శిక్షణ తీసుకుని ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కావున వెంటనే పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఇకపోతే మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచాలని, తరిమెల ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని, హెచ్చెల్సీ చివరి ఆయకట్టు అయిన సలకంచెరువు చెరువుకు నీటి అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. వీటితోపాటు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగేంద్ర, భాస్కర్, వెంకటేశు, ఎర్రిస్వామి, సూర్యప్రకాష్, రమణ, సుంకన్న, కొండారెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో వసతులు కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : పట్టణంలోని హిందూ శ్మశాన వాటికల్లోని ముళ్ళచెట్లు,పిచ్చి మొక్కలు తొలగించి, వెలగని వీధిలైట్లు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా మూడు హిందూ శ్మశాన వాటికలు ఉన్నాయన్నారు. వాటిల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించాలని, కొత్త వీధిలైట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు షాషా, సూరి, తిమ్మప్ప, ఉలిగప్ప, ఖాదర్, బాలాజీ, పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా

పెద్దపప్పూరు : మండల కేంద్రంతోపాటు నరసాపురం గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్య డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో 75, నరసాపురంలో 96 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. వచ్చేనెల 15వతేదీ వరకూ పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైద్యాధికారులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి ఎస్సీ కాలనీలో ప్రారంభమైన తాగునీటి పైప్‌లైన్ పనులను డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్ సోమవారం పరిశీలించారు. గత కొద్దికాలంగా నడిమిదొడ్డి ఎస్సీ కాలనీలో తీవ్రమైన నీటిఎద్దడి నెలకొంది. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో దాదాపు 500 మీటర్ల వరకూ నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. దీంతో పైప్‌లైన్ పనులను పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

పెద్దపప్పూరు : ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఎంపిడిఒ శకుంతలను సోమవారం మండలం కేంద్రంలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంపిడిఒ శకుంతల నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించారన్నారు. అలాంటి ఆమె మరిన్ని ఉద్యోగోన్నతులు పొంది, ఆయురారోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, తహశీల్దార్ బాలాజీరాజ్, ఎఒ మహిత, ఎపిఒ చంద్రకళ, మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

యల్లనూరు : మండలంలోని యల్లనూరు, కృష్ణాపురం, జంగంపల్లి, పాతపల్లి గ్రామాల్లో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వైద్యులు లోకేష్ కుమార్, శివసాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వర్‌రెడ్డి, సిహెచ్‌ఒ మధుకుమార్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న రెడ్డిసంఘం నేతలు

అనంతపురం : రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలని ఎపి రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఒ.ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు పాటిల్ రామకృష్ణారెడ్డి, నాయకులు ఫైర్ కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, చవ్వా హనుమంతురెడ్డి, అరవిందరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, అనిల్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పరంధామరెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా నీటిని నిల్వ ఉంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎం స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్తలు మహబూబ్బీ, సుజాత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం : 69వ ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాలోని అండర్-14, అండర్-17, అండర్-19 కేటగిరీల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను డైట్ కళాశాల పీడీ బుక్కపట్నం రామకృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల పాఠశాల క్రీడా కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, ఎపి శాప్ రాష్ట్ర అధ్యక్షులు, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి




విజయవాడ ధర్నాలో పాల్గొన్న జిల్లా సిఐటియు నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ పథకాల అమలు చేయాలని సిటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం విజయవాడ లేబర్ కమిషన్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అనంతపురం జిల్లా నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రసాద్, మన్నీల రామాంజనేయులు, కోశాధికారి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, కార్మికులు పామిడి మల్లేష్, సాయికుమార్, సాలమ్మ, సూరి, ఇమామ్, వేణు, ప్రవీణ్, రాజ, రాజేష్, రసూల్, వెంకట్ నారాయణ, విజయ్, సాయి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల బంగారు రుణాలను వడ్డీతో రెన్యువల్ చేయాలి

ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి


యూనియన్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

రైతులు బంగారు తాకట్టు పెట్టిన రుణాలను వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో తాడిపత్రి యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారామ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పెట్టుబడి ఖర్చులకు బయట వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పు తీసుకోలేక కుటుంబంలోని మహిళల బంగారాన్ని తాకట్టుపెట్టి పంటలకు పెట్టుబడి పెడుతున్నారన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం రాకపోగా నిరంతరం రైతులకు అప్పులే మిగులుతున్నాయన్నారు. దీంతో రైతులు అప్పులఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కావున ప్రభుత్వం, బ్యాంకు అధికారులు స్పందించి కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని బంగారు రుణాలను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్పొరేట్ సెలూన్లను తొలగించేంత వరకు ఉద్యమం

క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో కార్పొరేట్ సెలూన్ దుకాణాలను తొలగించేంత వరకూ ఉద్యమం చేద్దామని క్షవర వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గంగానగర్ కాలనీలోని రజక సంఘం ఫంక్షన్ హాలులో క్షవర వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షవర వృత్తిదారులు డిమాండ్ న్యాయమైందన్నారు. కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకు వారి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సహకరిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా ఈనెల 17, 18, 19, 20, 21, 22వతేదీల్లో నిరసనలు తెలియజేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకులు జగ్గిలి రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, రజక సంఘం జిల్లా నాయకులు దేవేంద్రప్ప, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు స్వామిదాస్, వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షులు యల్లప్ప, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, తిమ్మప్ప, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సురేంద్రబాబు, క్షవర వృత్తిదారుల సంఘం కోశాధికారి బ్రహ్మ, నాయకులు బాలకృష్ణ, అజయ్, అంజి, బాల, విజయ్, సాయి, లీలాకుమార్, శివ, శంకర్, ఎర్రిస్వామి, నవీన్, చరణ్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టాలని వినతి


అధికారులతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామాల్లో బెల్ట్‌షాపులు అరికట్టడంతోపాటు ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయించాలని రైతు, కౌలురైతు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఉరవకొండ ఎక్సైజ్ ఎస్ఐ పోతులయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాల్లో బెల్ట్ షాపులు ఉన్నాయన్నారు. ఉదయం 6 నుంచి అర్ధరాత్రి వరకూ మద్యాన్ని ఎక్కువ రేట్లకు అమ్ముకుంటూ గ్రామాల్లో పేదలు, రైతులు, కూలీల నుంచి దోచుకుంటున్నారన్నారు. తాగడానికి మంచినీళ్లు దొరకడం లేదు గానీ, మద్యం మాత్రం ఏరులై పారుతోందన్నారు. మద్యం వల్ల కుటుంబాల్లో గొడవలు చెలరేగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టు షాపులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధు సూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కార్యదర్శి మురళి, వీరాంజినేయులు, రైతు సంఘం నాయకులు సిద్ధప్ప, రామాంజనేయులు నాయక్, కౌలు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు సురేష్, కార్యదర్శి ముష్టూరు వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్రూం ఆధ్వర్యంలో ఆఖరి సంవత్సరం విద్యార్థినులకు ఐదురోజులపాటు నిర్వహించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా విద్యార్థినులు డిగ్రీ అయిపోయిన తర్వాత మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలు సాధించేందుకు, పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలకు కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థినులకు అందజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, ఎఒ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సాయిరామ్, నాంది ఫౌండేషన్ సిబ్బంది వై.హరికుమార్, వై.శ్రీనివాసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వం అంగీకరించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగులు, కార్మికుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం గుత్తిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల సాధనకై దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సంయుక్త కార్యాచరణ సమితి నాయకులు విన్సెంట్ కుమార్, సత్యనారాయణ, రఫీ, సాయి, సాయి ప్రకాష్, వెంకటేష్, సూర్యనారాయణ, ఆంజనేయులు, హాజీబాషా, కృష్ణప్రసాద్, హరిలాల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడటం సామాజిక బాధ్యత


వ్యాసరచన పోటీల విజేతలతో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రకృతిని కాపాడటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయశ్రీ అన్నారు. అనంతపురం మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'మానవ వికాసానికి ప్రకృతితో శృతి కలిగి ఉండటం చాలా అవసరం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ వికాసానికి ప్రకృతి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అందుకనే ప్రకృతితో శృతి కలిగి ఉండటం చాలా అవసరమన్నారు. ప్రకృతిని భావితరాల కోసం కాపాడటం సామాజిక బాధ్యత అన్నారు. తమ వైద్య కళాశాల విద్యార్థులు సామాజిక దృక్పథం కలిగి ఉండటం అభినందనీయమన్నారు. హార్ట్ ఫుల్ మెడిటేషన్ శిక్షకులు, శరీర ధర్మశాస్త్ర ప్రధాన విభాగాధిపతి డాక్టర్ సరళ, పీడియాట్రిక్స్ డాక్టర్ శంకర్‌నారాయణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా, హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ శిక్షకులు ఫిజియాలజీ హెచ్‌ఒడి హెచ్‌ఒడి డాక్టర్ సరళ, పీడియాట్రిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకరనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ఎపి ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు నెలలపాటు నిర్వహించే ప్రచార వాహనాన్ని సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఇబి దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ జన సమ్మర్ధ ప్రదేశాలు, హెచ్ఐవి ప్రభావిత ప్రాంతాల్లో ఈ వాహనాన్ని నిలిపి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ రోజుకు 6-8 ప్రాంతాల్లో వాహనాన్ని నిలిపి హెచ్ఐవి, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో త్యాగరాజు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ జివి రమణ, సిబ్బంది మురళి, నారాయణస్వామి, రమణ, సిబ్బంది నరేష్‌బాబు, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ


రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వం నూతనంగా తయారు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న సితార ఫంక్షన్ హాలులో పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేయడంతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎపి రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకటశివుడు యాదవ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా, తహశీల్దార్ జి.పుణ్యవతి, ఎంపిడిఒ డి.ప్రభాకర్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనాయాదవ్, నాయకులు జి.సుంకన్న, బి.లక్ష్మీరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా అనంతపురం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎపిపిఎస్‌సి సభ్యులు సి.శశిధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిస్టిక్ ప్రెసిడెంట్ పురుషోత్తం మురళీకృష్ణ, ఈసీ మెంబర్ విశ్వనాథ్, సిఆర్ఎడిఎఐ ఛైర్మన్ బి.తిరుపాలు, స్టేట్ ఇసి సభ్యులు వై.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల కేంద్రంలో నూతనంగా వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.శేషారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల్లో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సూర్యప్రతాప్, సిఎస్‌డిటి చంద్రకళ, వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, టిడిపి నాయకులు గోరంట్ల మారుతీనాయుడు, నాయీబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఆదినారాయణ, శింగనమల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, మాసూలు చంద్రమోహన్, స్టోర్ డీలర్లు కాయగూరల సత్తి, శివ, మసూద్‌వలి, చాకలి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండలంలోని పెద్దపేట గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో దామోదర్ నాయుడు, స్టోర్ డీలర్ చంద్రమోహన్ నాయుడు, మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరి రంగయ్య, టిడిపి నాయకులు చరణ్, రవికుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తాంద్ర విక్రమ్, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో సోమవారం ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగేంద్ర, ఉపాధ్యాయులు శశినేత్ర, పరమేష్, అమరావతి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా అధికారులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బాలాజీసాగర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణీలో ఎక్కడ నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఇంటికీ వెళ్లి పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో నూతన రేషన్‌కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామాంజనేయులు, వీఆర్వో శ్యామల, డీలర్ యంగమునిరెడ్డి, టిడిపి నాయకులు గోవర్ధనరాజు, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : కూటమి ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులకు పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తోంది. మండలంలో సోమవారం కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, వీఆర్వోలు, స్టోర్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ మునివేలు రేషన్ డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నేటి నుంచి అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది రేషన్‌కార్డు దారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు

కళ్యాణదుర్గం టౌన్ : మండలంలో వివిధ రేషన్ దుకాణాల డీలర్లకు తహశీల్దార్ భాస్కర్ స్మార్ట్ కార్డులు అందజేశారు. డీలర్లు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల పంపిణీ చేయాలని తహశీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి దుర్గప్రసాద్, విఆర్ఒలు, మహిళా పోలీసులు, డీలర్లు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పోలేపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ సుమతి తెలిపారు. ఆమె సోమవారం జడ్పిటిసి ప్రభావతమ్మ, డీలర్లతో కలిసి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో హనుమంతరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరమణ, నాయకులు రామచంద్రప్ప, కొల్లు తిప్పేస్వామి, డీలర్లు కురుమల్లి, లింగన్న, వడ్డే ఈరన్న, సోమశేఖర్, గౌడ, వీరేష్, తిప్పేస్వామి, మంజు, లాజర్, నవీన్, మారుతి పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని 34 రేషన్ దుకాణాల్లోని లబ్ధిదారులకు సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డులో క్యూ ఆర్ కోడ్ స్కాన్ ఉందన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసే కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక నెహ్రూకాలనీలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజనరీతో ఆలోచించి స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకొచ్చారన్నారు. ఈ కార్డులతో పారదర్శకంగా పథకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవ, గౌస్‌పీరా, బొమ్మా మోహన్, ఓబులాపురం వెంకటేష్, ధనుంజయ, కరూరు శివశంకర్, భాస్కర్‌నాయుడు, రాజేష్‌నాయక్, వడ్డే ఆనంద్‌బాబు, రమణ, అప్పన్న గారి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు, పడమటి యాలేరు వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కృష్ణమోహన్ చౌదరి, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, నాయకులు నరసింహచౌదరి, వేణుగోపాల్, సూర్యనారాయణ, కందుల ఓబుళపతి, వెంకటనారాయణ, నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ డైరెక్టర్ మంగలి ఆనంద్, హైస్కూల్ ఛైర్మన్ బొమ్మయ్య, సూర్యనారాయణాచారి, గుజ్జుల రవి, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

యాడికి : మండల కేంద్రంలోని రమణమ్మ కుమారుడు సత్య (23) అనారోగ్య కారణాలతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి తల్లి రమణమ్మ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీకి చెందిన రమణమ్మ కుమారుడు సత్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అయితే సత్యకు కడుపు నొప్పి ఉండటంతో పలుచోట్ల వైద్యం చేయించాడు. అయినా నయం కాకపోవడంతోపాటు సోమవారం కడుపు నొప్పి అధికం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నూర్పిడి యంత్రం బోల్తా.. మహిళా కూలీ మృతి

కణేకల్లు : మండలంలోని మీన్లహళ్లి గ్రామ శివారులో ఉన్న వంక వద్ద సోమవారం వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా పడడంతో దాని కింద పడి వ్యవసాయ కూలీ గౌరమ్మ(40) మృతి చెందింది. తుంబిగనూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు గౌరమ్మ, స్నేహిత, గంగమ్మ, వనజాక్షి, సుజాత వేరుశనగ పంట నూర్పిడి కోసం నూర్పిడి యంత్రంతో పాటు మీన్లహళ్లి గ్రామానికి బయల్దేరారు. వీరంతా నూర్పిడి మిషన్‌పై కూర్చొని వెళ్తుండగా మీన్లహళ్లి వంక వద్దకు చేరుకోగానే నూర్పిడి యంత్రం ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌరమ్మ మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయంతెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ సోమవారం ఆత్మహత్నాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. గుత్తి మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన సావిత్రి కొన్నినెలలుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేది. ఈక్రమంలో ఆమెకు అనారోగ్య సమస్యలు కూడా చుట్టుముట్టాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు ఆమెను అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.